## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: రోడ్డు విస్తరణ జరుగుతున్నందున్న నల్లగొండ పట్టణంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గొల్లగూడ ఫీడర్ పరిధిలోని మిర్యాలగూడ రోడ్డు, బీటీఎస్, దుర్గాకాలనీ, కలెక్టరేట్, ఫారెస్టు ఆఫీస్ రోడ్డు, శివాలయం, డైట్ సమీప కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

### డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే వీరేశం


భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిశారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకులంగా స్పందించారని ఎమ్మెల్యే వీరేశం తెలిపారు.

### నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: పట్టణంలోని పద్మానగర్‌కు చెందిన గంజి ఉమాకాంత్ మృతి చెందాడు. ఐడొనేషన్ సెంటర్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ బుధవారం కుటుంబ సభ్యుల అనుమతితో ఉమాకాంత్ నేత్రాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు మాధవి, రామ్‌చరన్, శోభన్‌బాబులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు ఎండీ. డాక్టర్ హరినాథ్, డాక్టర్ పుల్లారావు, సరిత, రవి శంకర్ పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్: ఓపెన్ ఇంటర్, పదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 31 తేదీలోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని నకిరేకల్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోదాటి రాములు బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు 9849135397, 9949356551 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

**కేతేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..**

కేతేపల్లి: మండల కేంద్రలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31తేదీ వరకు గడువు పొడిగించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టాస్ కోఆర్డినేటర్ యానాల నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసినవారు ఓపెన్ టెన్త్‌లో చేరి పదో తరగతి పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆధార్, టీసీ, కుల ధృవీకరణ పత్రాల జీరాక్స్‌లు, 3 పాస్ ఫొటోలు జతచేసి ఈ నెల 31లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 929169027, 8500888555 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

### సభ్యత్వ నమోదు

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి జెడ్పీహెచ్ఎస్‌లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏశమల్ల నాగయ్య, గడగోజు సతీష్, జానకి, రామలింగయ్య, రఘు, చంద్రశేఖర్, రాంమోహన్, పద్మ పాల్గొన్నారు.

**తపస్ ఆధ్వర్యంలో..**

శాలిగౌరారం: మండలంలో పలు పాఠశాలల్లో బుధవారం తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుపల్లి పాపిరెడ్డి తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, శాలిగౌరారం, కట్టంగూరు, కేతేపల్లి మండలాల బాధ్యులు వెంకటేశ్వర్లు, వాణి, పాండరి, యాదగిరి, కృష్ణ, మధుసూదన్ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న నాయకులు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల చనిపోయిన పేదల కుటుంబ సభ్యులకు చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. చండూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన నల్లగంటి కిరణ్, ఎర్రజెల్ల కమలమ్మ కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగంటి మల్లేష్, జనార్దన్, ధర్మేందర్, వేణు, ముజ్జు, రామ్మూర్తి, మారయ్య, దశరథ, కృష్ణారెడ్డి, చరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో రోడ్డు విస్తరణ గుబులు

- ఇప్పటికే మార్కింగ్ ఇచ్చిన అధికారులు
- నిరాశ్రయులు కానున్న పేదలు
- పరిహారం ఇస్తారేమోనని ఎదురుచూపులు

చండూరు : పల్లెల్లో రోడ్డు విస్తరణ గుబులు పట్టుకుంది. రోడ్డు వెంట ఉన్న ఏ కుటుంబాన్ని కదిల్చినా అదే గుబులుతో కాలం వెళ్లదీస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా రకరకాల వాదనలు, పుకార్లు బయటకు వస్తున్నాయి. దీని ప్రభావం రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఎంత మేర చూపుతుందోనని అధికార పార్టీ నాయకులు కలవరపడుతున్నారు. చండూరు నుంచి మాల్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో చండూరు పట్టణంలో రచ్చ నడుస్తోంది. అదేవిధంగా గ్రామాల్లో ఇళ్లు కోల్పోతున్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ, దోనిపాముల గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో విస్తరణ పనులు చేపడుతుండడంతో తర్వాత ఈ గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

**45 ఇళ్ల యజమానులకు తీవ్ర నష్టం**

రోడ్డు విస్తరణలో చండూరు మండల పరిధిలోని దోనిపాముల గ్రామంలో తక్కువ ఆస్తి నష్టం జరుగుతున్నప్పటికీ బంగారిగడ్డ గ్రామంలో చాలా నష్టం జరుగనుంది. దాదాపు 300 మీటర్ల మేర పొడవు, 66 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించనున్నారు. ఇప్పటికే రోడ్డు వెంట ఉన్న కట్టడాలను ఎంతమేర కూల్చివేయనున్నారో అధికారులు మార్కింగ్ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో దాదాపు 45 ఇళ్ల యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. వారికి ఉన్న ఇంటి స్థలం మొత్తం విస్తరణలో పోతుండడం వల్ల నిరాశ్రయులు కానున్నారు. ఈనేపథ్యంలో వారు జూన్ 18న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి విస్తరణ 66 ఫీట్ల నుంచి ఎంతో కొంత తగ్గించాలని, నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నారు. దీంతో ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి ఎంతమేర నష్టం కలుగుతుంది, ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై చర్చించారు. కానీ ఎలాంటి న్యాయం చేస్తారనే విషయమై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులవుతున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని బంగారిగడ్డ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు తక్షణ సాయంగా నష్టపరిహారం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులుగా చేర్చాలని బాధితులు కోరుతున్నారు



చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో రోడ్డు విస్తరణ చేపట్టనున్న వీధులు


బంగారిగడ్డలో రోడ్డు విస్తరణలో కూల్చివేయనున్న ఇళ్లు

**ఇల్లు కట్టుకునే స్థోమత లేదు**


మాకు ఉన్న ఇల్లు మెత్తం రోడ్డు విస్తరణలో కోల్పోతున్నాం. కూలి పని చేసుకుంటేనే పూడ గడిచే మాకు.. ఇప్పుడు కొత్తగా జాగా కొనుక్కుని ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. ప్రభుత్వం మాకు ఎంతో కొంత నష్టపరిహారంతోపాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి.

–మాదగోని నర్సమ్మ, బంగారిగడ్డ

**ఇల్లు కట్టించి ఇవ్వాలి**


నాకు ఉన్నదే రెండు గదుల ఇల్లు. నా భర్త చనిపోయి 30 ఏళ్లయింది. కూలీనాలీ చేసి ముగ్గురు ఆడపిల్లల పెళ్లి చేశా. ఇప్పుడు తీరా వృద్ధాప్యంలో ఉండడానికి ఇల్లు లేకుండా పోతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి. ఎక్కడైనా జాగా ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలి.

–మారగోని యాదమ్మ, బంగారిగడ్డ

## విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉపేందర్

రామగిరి(నల్లగొండ): కళాశాలలో ఉన్న వసతులు, లైబ్రరీ, ల్యాబ్, కంప్యూటర్లు, డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. నల్లగొండ ఎన్జీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన సోషల్ సైన్స్ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో ప్రతిభను చాటుకునేందుకు విద్యార్థులకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అంతటి శ్రీనివాస్, ఐక్యూఎస్‌సి కోఆర్డినేటర్, డాక్టర్ వై.ప్రసన్నకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ బత్తిరి నాగరాజు, బీఏ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మునిస్వామి, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.వెల్దండి శ్రీధర్, బట్టు కిరీటం, మల్లేశం, సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని విభజించాలి

నల్లగొండ టౌన్: నల్లగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని అర్బన్, రూరల్‌గా విభజించాలని సీపీఎం కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. బుధవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గంలో చిన్న నీటి కాలువల ద్వారా ప్రతి ఎకరానికి నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, మండల కమిటీ సభ్యులు పోలె సత్యనారాయణ, జిల్లా అంజయ్య, బొల్లు రవీందర్ పాల్గొన్నారు.

## ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

మర్రిగూడ: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రహరీ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ప్రహరీ, ఐదు తరగతి గదులు, 20 బాత్‌రూమ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడాల అల్వాల్‌రెడ్డి, బిచ్చానాయక్, మార్నేని లూర్థయ్య, చిట్యాల రంగారెడ్డి, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, భీమానాయక్, ఐతగోని వెంకటయ్య, చిట్యాల యాదగిరిరెడ్డి, పగడాల లింగయ్య, మేతరి శంకర్, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై సీసీ కెమెరాల ఏర్పాటు

కేతేపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో గల జంక్షన్ వద్ద అధికారులు బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సరైన నిర్వహణ లేకపోవడంతో బిగించిన ఏడాదిలోపే మరమ్మలకు గురయ్యేవి. దీంతో హైవేపై జంక్షన్ వద్ద రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రమాదాలు కారణమై వాహనాలను గుర్తించడం పోలీసులకు కష్టతరంగా మారింది. ఈనేపథ్యంలో ప్రమాదాలకు కారణమైన వాహనాలతోపాటు, నేరాలకు సంబంధించి నిందితులను గుర్తించేందుకు వీలుగా అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అధునాతన టెక్నాలజీతో రూపొందించిన సీసీ కెమెరాల విలువ దాదాపు రూ.లక్షకు పైగానే ఉంటుందని అధికారులు తెలిపారు. కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ జంక్షన్ వద్ద హైవేపై విజయవాడ వైపు ఒకటి, హైదరాబాద్ వైపు మరొక సీసీ కెమెరాను స్థానిక పోలీసుల పర్యవేక్షణలో బిగించారు. రోడ్డుపై జరిగే సంఘటలను పోలీస్‌స్టేషన్‌లోని మానిటర్‌లో వీక్షించే వీలుంది. ఈ కెమెరాలు రాత్రివేళ, వెలుతురు లేని సమయంలో కూడా రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనంతోపాటు దాని రిజిస్ట్రేషన్ నంబర్‌ను స్పష్టంగా రికార్డు చేస్తుందని ఎస్ఐ సతీష్ తెలిపారు.


కేతేపల్లిలో హైవేపై సీసీ కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

# వన మహోత్సవ లక్ష్యం పూర్తయ్యేనా !

- లక్షా 46 వేల మొక్కలు నాటడం లక్ష్యం
- ప్రస్తుతం ఖాళీ ప్రదేశాలు, చనిపోయిన వాటి స్థానంలో నాటుతున్న కూలీలు
- మిగిలిన మొక్కలు నాటడానికి స్థలాలు వెతికే పనిలో అధికారులు

మునుగోడు: రాష్ట్రంలో అడవుల శాతం పెంచేందుకు గత ప్రభుత్వం విరివిగా మొక్కలు పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల సమన్వయంతో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటించింది. ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో గ్రామాల్లో, పట్టణాల్లో మొక్కలను నాటిస్తోంది. అయితే రోడ్ల వెంట ఖాళీ ప్రదేశాల్లో గతంలో నాటిన మొక్కలు ఉండడంతో నూతనంగా మొక్కలను ఎక్కడ నాటించాలో తెలియక అధికారులు సందిగ్ధంలో ఉన్నారు.

**27 గ్రామాల్లో నర్సరీలు..**

మునుగోడు మండల వ్యాప్తంగా ఉన్న 27 గ్రామాల్లో ఈ సంవత్సరం వన మహోత్సవంలో మొత్తం లక్షా 46 వేల మొక్కలు నాటేలా లక్ష్యం ఏర్పాటు చేశారు. అందుకోసం మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేసి ప్రతి నర్సరీలో ఐదువేల నుంచి 15వేల వరకు మొత్తం 2 లక్షల 57వేల మొక్కలను పెంచారు. అందులో ప్రతి గ్రామంలోని ఇంటింటికీ 6 మొక్కల చొప్పున 72 వేల మొక్కలు పంపిణీ చేయాలి. ఇప్పటివరకు 10 వేల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. రోడ్ల వెంట, ప్రభుత్వ స్థలాల్లో 63 వేల మొక్కలు నాటాల్సి ఉండగా అందుకోసం ఇప్పటి వరకు కూలీలతో 35వేల గుంతలు తవ్వించారు. అరకొరగా వర్షాలు కురవడంతో ఇప్పటి వరకు 15వేల మొక్కలను రోడ్లకు ఇరువైపులా, గతంలో నాటి చనిపోయిన బృహత్ పల్లె ప్రకృతి వనాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, చెరువులు, కుంటల కట్టల వెంట నాటించారు. మిగిలిన మొక్కలను నాటేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటితోపాటు ఎక్సైజ్ అధికారులు వారి లక్ష్యం మేరకు ఈత చెట్లు నాటించాల్సి ఉంది.


కల్వలపల్లి సమీపంలో రోడ్డు పక్కన గుంతలు తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

**ప్రజలు సహకరించాలి**


వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను బతికించేందుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటి వరకు 15 వేల మొక్కలు నాటించాం. మిగిలిన మొక్కలను ఆగస్టు చివరి వారం లోపు పూర్తిగా నాటిస్తాం.

– విజయభాస్కర్, ఎంపీడీఓ

## వానరానికి అంత్యక్రియలు

మునుగోడు: మండలంలోని గంగోరిగూడెంలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన కోతికి గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల, ఊరేగింపుతో గ్రామ శివారులో కోతి మృతదేహాన్ని ఖననం చేశారు. మాజీ సర్పంచ్ పానుగంటి పారిజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.


కోతికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

## ఏకాగ్రతతో పనిచేస్తే విజయం సాధ్యం

నకిరేకల్ : మంచి ఆలోచనలు, ఆసక్తి, ఏకాగ్రతతో విద్యార్థులు పనిచేస్తే విజయాలు వరిస్తాయని ప్రముఖ మెజీషియన్, మోటివేషనల్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్పీకర్ జి.రామకృష్ణ అన్నారు. నకిరేకల్‌లోని లయన్స్ సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో శాస్త్ర, న్యూ విజన్ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం వ్యక్తిత్వ వికాసం, మెమోరీ పవర్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధించి తీరాలన్న పట్టుదలతో పనిచేస్తే సక్సెస్ అవుతారని అన్నారు. క్లబ్ అధ్యక్షుడు కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ రావిరాల అశోక్, చార్టర్ ప్రెసిండెంట్ యానాల రజినీకాంత్‌రెడ్డి, ప్రతినిధులు కందాల వెంకట్‌రెడ్డి, బూత్కురి వెంకట్‌రెడ్డి, యానాల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మెజీషియన్ రామకృష్ణ

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నల్లగొండ టౌన్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిల్ల మురళి, కార్యదర్శి జె. శేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. వివిధ శాఖల్లో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహాచారి, మేడి జయరావు, డీఐ రాజు, ఎ.లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, సైదులు, మధుసూదనచారి, రణదీవె, మధు, రాజశేఖర్, ప్రభు, నారాయణ స్వామి, నరేష్‌కుమార్, కె.దశరథ, రమ్యసుధ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, వహీద్, జయపాల్, అనురాధ, సోమేశ్వరి, పి.కమల, వరలక్ష్మీ, సంధ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎన్‌జీఓ నాయకుడు

## మున్సిపల్ కార్మికులకు భద్రత కిట్లు అందజేత

నల్లగొండ టూటౌన్: నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) డేలో భాగంగా బుధవారం నీలగిరి మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తన చాంబర్‌లో సఫాయి మిత్ర కార్మికులకు ఆయుష్మాన్ ఆరోగ్యకార్డులు, భద్రత పరికరాలు, పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమస్తే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులతోపాటు వ్యర్థాలను సేకరించే వారిని, స్వయం సహాయక సంఘం సభ్యులను, స్థానిక కమ్యూనిటీ సభ్యులను కేంద్ర ప్రభుత్వం భాగస్వాములను చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈ అశోక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నంద్యాల ప్రదీప్ రెడ్డి, శ్రీనివాస్, పర్యావరణ ఇంజనీర్ వి.సతీష్‌రెడ్డి, ఐటీసీ ఇన్‌చార్జ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికులకు కిట్లు అందజేస్తున్న కమిషనర్

## కలెక్టర్ హామీతో నిర్వాసితుల దీక్ష విరమణ


భూ నిర్వాసితులకు హామీ పత్రం అందజేస్తున్న చండూరు ఆర్డీఓ శ్రీదేవి

మర్రిగూడ: తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీతోపాటు ఇంటి స్థలాలు కేటాయించాలని చర్లగూడెం భూ నిర్వాసితులు చేపట్టిన దీక్ష బుధవారం మూడోరోజుకు చేరుకుంది. కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో నిర్వాసితులు దీక్ష విరమించారు. హామీ పత్రాన్ని చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు నిర్వాసితులకు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ చింతపల్లి మండలంలోని వర్కాల గ్రామంలో భూమిని గుర్తించామని, అందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. దీక్ష వద్ద ఎలాంటి ఆందోళన జరగకుండా నాంపల్లి సీఐ డి.రాజు, ఎస్ఐ ఎం.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రిజర్వాయర్ ఈఈ రాములునాయక్, డీఈ ఖాసీం, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

## జగదీష్‌రెడ్డిని విమర్శించే స్థాయి వీరేశంకు లేదు

కట్టంగూర్ : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని విమర్శించే స్థాయి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ భిక్షపెట్టిన జగదీష్‌రెడ్డికే సవాల్ చేసే పరిస్థితి వచ్చిందంటే వీరేశం ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పోటీ చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, పాదూరి శశిపాల్‌రెడ్డి, మేకల రమేష్, నూక సైదులు, గుండాల మల్లేష్, కట్ట శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నలగాటి ప్రసన్నరాజ్

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలోని ఎన్జీ కాలేజీ ఎదుట బుధవారం బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అంబటి ప్రణీత్, కత్తుల జైచందస్, జెట్టి శివప్రసాద్, కళాశాల అధ్యక్షుడు బాలాజీ నాయక్, వెంకటేష్, సాయి, రాము, వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు సకాలంలో చెల్లించాలని వినతి

కేతేపల్లి: తమకు సకాలంలో వేతనాలు అందించాలని కోరుతూ ఫీల్డ్ అసిసెంట్లు బుధవారం కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతా కృపాకర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. సంఘం మండల అధ్యక్షురాలు జెబున్నిసాబేగం, కె.లచ్చయ్య, వెంకన్న, రంగమ్మ, మంగమ్మ, విజయ, వసంత తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

### ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

మునుగోడు: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే ప్రోత్సాహకాలు పొందేందుకు భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని చండూరు ఆర్‌డీఓ శ్రీదేవి సూచించారు. మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట ఏఈఓ నర్సింహ, రైతులు ఉన్నారు.

### రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

గట్టుప్పల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గట్టుప్పల్ మండలం ఖమ్మగూడెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం ఇడికూడ గ్రామానికి చెందిన చోటాబీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహించి స్కూటీపై మంగళవారం రాత్రి స్వగ్రామానికి వెళ్తోంది. ఈ క్రమంలో గట్టుప్పల్ మండలం ఖమ్మగూడెం సమీపంలో కొండాపురం రోడ్డు వద్ద టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న భువనగిరి తేరేడు అనే వ్యక్తి చోటాబీ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో చోటాబీ, తేరేడుకు గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

### 20న యువ కవి సమ్మేళనం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ సాహితి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 20న పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించనున్న యువ కవి సమ్మేళనం సాహిత్య సదస్సును జయప్రదం చేయాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ కోరారు. సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఎన్జీ కళాశాల ఆవరణలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కళాశాలకు చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొనాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్, అధ్యాపకులు డాక్టర్ రవికుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, స్వామి, అనిల్, అబ్రహం, అరుణ, జోత్స్న, మధుకర్, సిద్ధేశ్‌గౌడ్, వెంకటేశం, భీష్మాచార్య పాల్గొన్నారు.

### బాలుడిపై దాడి చేసిన కుక్క

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఓ బాలుడిపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన ఏడాదిన్నర బాలుడు లవంగి రిషి ఇంటి బయట తన అక్కతో పాటు ఆడుకుంటుండగా వీధి కుక్క రిషిపై దాడి చేసి ఛాతి, మెడ భాగంలో గాయపరిచింది. స్థానికులు గమనించి కుక్కను తరిమివేశారు. బాలుడికి తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, రేబిస్ వ్యాక్సిన్ కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.